## క్లుప్తంగా

### చేయూత



**ములుగు రూరల్:** మండలంలోని కాశిందే విపేట గ్రామానికి చెందిన రాజ్యం రమేశ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ అహ్మద్‌పాషా గురువారం పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎన్నిండ్ల ప్రదీప్, ప్రవీణ్, వీరస్వామి, తదితరులు ఉన్నారు.

### జాగ్రత్తగా ఉండాలి



**వాజేడు:** గోదావరి వరదలు వచ్చే సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కడేకల్ గ్రామంలో గురువారం గ్రామస్తులతో ఎస్సై మాట్లాడారు. వర్షాకాలంలో పల్లపు ప్రాంతాలకు గోదావరి వరదలతో పాటు వాగులు, వకలు పొంగి ప్రవహిస్తాయని ఆ సమయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాయం కావాలంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత వరదలను దృష్టిలో ఉంచుకుని లోటట్టు ప్రాంతాల వారి వివరాలను అందజేయాలని సూచించారు.

### అప్రమత్తత అవసరం



**వెంకటాపురం(కె):** అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్సై తిరుపతిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తిప్పాపురం పంచాయతీ కలిపాక గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గ్రామస్తులు ఈతకు, చేపలను పట్టేందుకు వెళ్లొద్దని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

### నాయకులగూడెంలో మదర్స్ క్లినిక్



**వెంకటాపురం(కె):** మండల పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో మదర్స్ క్లినిక్ కార్యక్రమాన్ని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలోని బాలింతల ఇంటికి వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. బాలింతలు ఐరన్ అధికంగా ఉంటే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఆదివాసీలకు న్యాయం చేయాలి



**వెంకటాపురం(కె):** కొమరంభీమ్ ఆదివాసీలకు న్యాయం చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీలు చేస్తున్న రిలే నిరహార దీక్ష గురువారానికి పదకొండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమామిడి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### కమిటీ ఎన్నిక

**గోవిందరావుపేట:** మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగుల వద్ద గురువారం నిర్వహించిన పెయింటింగ్ వర్కర్ల సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల పెయింటింగ్ వర్కర్లు కలిసి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గజ్జెల రంజిత్, ఉపాధ్యక్షుడిగా గురుకు మహేష్, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, ముఖ్య సలహాదారులుగా మహేష్, రాకేష్, మునిగాల కిషోర్‌లను ఎన్నుకున్నారు.

# ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఎస్ఎస్ తాడ్వాయి: చిన్నారులకు మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



ఏటూరునాగారం: తీగలవాయి అంగన్‌వాడీ కేంద్రంలో..



మంగపేట: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి వైశాలి

**ఎస్ఎస్‌తాడ్వాయి:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రణదీర్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని ఆయన సూచించారు.

**కన్నాయిగూడెం:** మండలపరిధిలోని గుర్రేవుల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జనగం సమ్మక్క, వైద్యాధికారి అభినవ్ మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణ కార్యక్రమం ఈ నెల 27 వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణకుమారి, కవిత ఉన్నారు.

**మంగపేట:** నులి పురుగుల వల్ల పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారి వైశాలిని, యమున, నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నులిపురుగుల వలన 01 నుంచి 19 సంవత్సరాల పిల్లల్లో రక్తహీనత, పోషకలోపం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సత్యవతి, ఖాదర్, అబ్బాస్, గంగమ్మ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**నులి పురుగులను నిర్మూలిద్దాం..**

**ఏటూరునాగారం:** నులి పురుగుల నివారణకు అందరూ సహకరించాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ వైద్యురాలు వజ్జ అనుష అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తీగలవాయి ఒకటి అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్యురాలు సందర్శించి చిన్నారులను పరీక్షించారు. అందరికీ అల్బెండజోల్ మాత్రలను వేశారు. చిన్నారులు మట్టి తినడం వల్ల నులిపురుగులు తయారవుతాయన్నారు వీటి వల్ల రక్తహీనత ఏర్పడడం, కాళ్లు చేతులు సన్నబడడం, పొట్ట ఉబ్బడం ఇలా సమస్యలు ఏర్పడతాయని ఆమె తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించి నులిపురుగుల మాత్రలను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇర్సవడ్ల సరోజ, ఆశా కార్యకర్త వినోద, ఆయా రోజా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఆశ్రమ పాఠశాలలో..**

మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రొయ్యూరు వైద్యురాలు సుమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమల, సుజాత, సుగుణవతి, ఏఎన్ఎంలు, హాస్టల్ వార్డెన్ శ్రీలత పాల్గొన్నారు.



వాజేడు: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ శ్యామల శారద, వైద్యులు



కన్నాయిగూడెంలో..



వాజేడులో..

**వాజేడు:** నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీపీ శ్యామల శారద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా వైద్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు పిల్లలకు మాత్రలు ఇచ్చారు.

### ఎస్సైని కలిసిన నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

**మంగపేట:** మంగపేట ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీవీఆర్ సూరిని కాంగ్రెస్ పార్టీ, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, జిల్లా, మండల నాయకులు యానయ్య, వెంకటేశ్వర్లు, శ్రావన్‌కుమార్, నర్సింహారావు యాదవ్, భగవాన్‌రెడ్డి, కాంతారావు, ఆదినారాయణ, సమ్మయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, బొర్రయ్య, శ్రీనివాస్, రాజా రత్నం తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఏజెన్సీలో భూములను కాపాడాలి

**మంగపేట:** రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఐదవ షెడ్యూల్డు ఏరియా(ఏజెన్సీ)లోని భూములు అన్యాక్రాంతం, కబ్జాకు గురికాకుండా కాపాడాలని పెసా కమిటీ జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన గిరిజనేతరుల మధ్య భూతగాదాలు, ఎల్టీఆర్ కేసులను పరిష్కరించేందుకు స్పెషలాఫీసర్, ములుగు ఏజెన్సీ ఏరియా సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన వారిని నియమించాలన్నారు. గిరిజనేతర చేతిలో అన్యాక్రాంతం, ఆక్రమణకు గురైన భూములను కాపాడేందు, ఐటీడీఏలో పేరుకు పోయిన వేలాది ఎల్‌టీఆర్ కేసులను పరిష్కరించి గిరిజనులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో 1/70, ఎల్‌టీఆర్ చట్టం నిబంధనలను అతిక్రమించి కొందరు ప్రభుత్వ అధికారులు ప్రైవేటు వ్యక్తులు ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి వేల కోట్ల రూపాయల విలువైన భూములను గిరిజనేతరులకు ఎలా బదిలీ చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

## అమరవీరుల స్థూపం నిర్మిస్తాం..



మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

**మంగపేట:** మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూడెం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని పునర్‌నిర్మిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు గురువారం అమరవీరుల స్తూపాన్ని నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అమరవీరుల స్మారకస్తూపాన్ని లారీ ఢీకొట్టిన సంఘటనలో కూలి పోయిందన్నారు. అనివార్య కారణాల వలన తిరిగి నిర్మించక పోవడంతో కాళీగా ఉన్న స్థలంలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారనే విషయం తెలిసిన వెంటనే తాను వారితో మాట్లాడానన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు, మహానటుడైన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని అక్కడ కాకుండా మరోచోట ఏర్పాటు చేసేందుకు తాము కూడా సహకరిస్తామని చెప్పడంతో వారు సానుకూలంగా స్పందించారని స్తూపాన్ని నిర్మించేందుకు వారు కూడా సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. త్వరలోనే అమరవీరుల స్తూపాన్ని నిర్మిస్తామన్నారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన టీవీఆర్ సూరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

మండలంలోని రాజుపేటకు చెందిన అనుముల అప్పిరెడ్డి, కమలాపురానికి చెందిన బండారి నర్సమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను లక్ష్మణరావు పరామర్శించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు, జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, చిట్టిమళ్ళ సమ్మయ్య, చిలకమర్రి రాజెందర్, మల్లికంటి శంకర్, దంతెనపల్లి నరెందర్ సోషల్ మీడియా ఇంచార్జి గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న పోలీసులు

**ఏటూరునాగారం:** ఇద్దరు యువకులు మండల కేంద్రంలో రెండు మొబైల్స్‌న్ పోగొట్టుకోగా సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ మొబైల్‌లను వారికి గురువారం అప్పగించారు. మండ కేంద్రానికి చెందిన రాము డిగ్రీ కాలేజ్ వద్ద, అలాగే కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన నాగేష్ ప్రవంతి నర్సింగ్ హోమ్ ఆస్పత్రి వద్ద ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు ఈ నెల 16న పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ, ఎస్సై మొబైల్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న తస్కరించబడిన ఈఎంఐ నంబర్‌తో సహా ఫిర్యాదు చేయాలని ట్రేస్ చేసి పట్టుకుంటామన్నారు.

## రోడ్లపై వ్యర్థ పదార్థాలు వేయొద్దు



మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

**ఏటూరునాగారం:** రోడ్లపై చెత్తాచెదారం వ్యర్థ పదార్థాలను వేయొద్దని ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాణి రుద్రమదేవి కూరగాయల మార్కెట్ ఆవరణలో వ్యాపారస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కూరగాయల మార్కెట్లో వ్యాపారస్తులు చెత్తాచెదారం, కుళ్లిన కూరగాయలు రోడ్డుపై ఇష్టం వచ్చినట్లు పడివేయడంతో ప్రధాన రహదారిపై దుర్వాసన వస్తుందని అన్నారు. రోడ్డు మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో కూరగాయల మార్కెట్‌కు వచ్చే ప్రజలు అనారోగ్యాలకు గురి అవుతారని తెలిపారు. రోడ్డుపై నడిచే ప్రజలు వర్షాకాలం కావడంతో రహదారి బురదమయంగా మారి జారి కింద పడిపోయే ప్రమాదం ఉందని అన్నారు. వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ వారి షాపుల వద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ వాహనం వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. పోలీసులు సుధాకర్, గోపి ఉన్నారు.

## అల్లుడిపై కొడవలితో మామ దాడి



తలపై గాయాలతో ఉన్న విజయ్



వీపుపై ఏర్పడిన గాయం

**మంగపేట:** భార్యను తీసుకెళ్లేందుకు అత్తగారింటికి వచ్చిన అల్లుడిపై మామ కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రునిపేటలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన నాంపెల్లి విజయ్ అదే జిల్లా పినపాక మండలం బయ్యారంలో కోమలి అనే రెస్టారెంట్ నడుపుతూ ఓ పత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం విజయ్‌తో భార్య గొడవపడి తన పుట్టినిల్లు అయిన మంగపేట మండలం రామచంద్రునిపేటకు వచ్చింది. ఈ క్రమంలో విజయ్ గురువారం భార్యను తీసుకెళ్లేందుకు తన తల్లితో కలిసి కారులో వచ్చారు. ఈ క్రమంలో మామఅల్లుడు వెంకన్న, విజయ్‌లు గొడవపడ్డారు. అల్లుడి విజయ్‌పై మామ వెంకన్న కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను స్థానికుల సహకారంతో అదే కారులో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్యను తీసుకెళ్తున్న క్రమంలో తన కుమారుడిని తన ఎదుటనే ఇంటి లో పలికి పిలిచి వెంకన్న, అతని తమ్ముడు కలిసి కొడవలితో దాడి చేసి గాయపరిచారని బాధితుడి తల్లి ఆరోపించింది. కాగా, ఇద్దరం ఒకరినొకరు నెట్టుకున్నామని, ప్రమాదవశాత్తు కత్తిపీటపై పడడంతో విజయ్ కి గాయమైందని మామ వెంకన్న చెప్పాడు. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

### నాసిరకంగా రోడ్డు విస్తరణ పనులు



పగుళ్లు ఏర్పడిన రహదారి

**వాజేడు:** మండల పరిధిలోని పెద్ద గొళ్లగూడెం వద్ద 163 నంబర్ జాతీయ రహదారిని డబుల్ రోడ్డు నుంచి ఫోర్‌వేకు కన్వర్షన్ చేశారు. సుమారు కిలో మీటర్ మేర పాత రహదారిని తొలగించి కొత్తగా ఫోర్‌వే రహదారిని విస్తరించారు. రహదారి నిర్మాణ సమయంలో అధికారులు అందుబాటులో లేక పోవడంతో కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లు రహదారి విస్తరణ పనులను చేపట్టారు. క్యూరింగ్ పనులను కూడా సక్రమంగా చేయకుండా రహదారి వేశారు. దీంతో పెద్దగొళ్ల గూడెం గ్రామ చివరన రహదారి పగిలిపోయింది. రహదారి విస్తరించిన కొద్ది రోజులకు రహదారి పగుళ్లు తేలి విడి పోతుండటంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌తో తిరిగి పనులను నాణ్యతతో చేయించాలని మండల ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## స్థలాల పోరాటానికి అండగా సీపీఎం



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న నాయకులు

**వెంకటాపురం(కె):** పేదల ఇంటి స్థలాల పోరాటానికి సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోదాపురంలోని ప్రభుత్వ స్థలంలో ఆదివాసీలు ఇంటి స్థలాల కోసం పాకలు వేయడంతో ఈ ప్రాంతాన్ని సీపీఎం పార్టీ బృందం గురువారం పరిశీలించి సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, కృష్ణ, రాము ఉన్నారు.

**ప్రమాద కరంగా జాతీయ రహదారి**

**వాజేడు:** 163 నంబర్ జాతీయ రహదారి ప్రమదకరంగా మారిందని అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మండల పరిధిలోని పాయబాటలు, దూలాపురం, సుందరయ్య కాలనీ, గుమ్మడిదొడ్డి, నల్లవాగుబ్రిడ్జి, చీకుపల్లి, టేకులగూడెం గ్రామాల్లో జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదంగా ఉందన్నారు. మరమ్మతులు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రఘుపతి రావు, దేవయ్య, కృష్ణబాబు, దామోదర్, ముత్తయ్య, రమాదేవి, సౌమ్య, కృష్ణ బాబు, ప్రవీణ్, శాంత కుమారి, నరేష్, మధు ఉన్నారు.

### డిపో ఏర్పాటు చేయాలి

**ములుగు:** జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ములుగు తరువాత డివిజన్‌లుగా ఏర్పడిన నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లిలో బస్ డిపోలు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యంతో ములుగు వెనుకబాటుకు గురయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగులో డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. అదే విధంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ములుగు జిల్లాకు సమ్మక్క–సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని కోరారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

**ములుగు రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జిల్లాకో ఇంటర్‌నేషన్ స్కూల్ ఏర్పాటు చేస్తామని అన్నారని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ లేక విద్యార్థుల తల్లితండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్య పుస్తకాల అమ్మకాలు చేపడుతూ దోపిడీకి పాల్పడుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలని అన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

### పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

**వెంకటాపరం(కె):** మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్వపరిపాలన, పంచాయతీ రాజ్ చట్టంపై గ్రామస్తులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తారం పాఠశాల ఉపాధ్యాయుడు కారం రాంబాబు గ్రామస్తులుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవ సంస్థ సభ్యులు గొంది హనుమంతు, కామేష్, ఉషారాణి, ఇందిర, నరేష్, పద్మ, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.